## క్లుప్తంగా

### సమస్యలను పరిష్కరిస్తాం

**చక్రాయపేట :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంతుబాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### దాడిలో ఒకరికి గాయాలు

**కొండాపురం :** మండల పరిధిలోని వెంకయ్య కాలువ గ్రామంలో సోమవారం ఇంటి దగ్గర దారి విషయంలో రమాదేవిపై చాకలి చిన్నదుబ్బన్న, ఆంజనేయుడు, బాబులు దాడిచేయడంతో ఆమె తలకు గాయాలైనట్లు ఎస్ఐ యోగీంద్ర తెలిపారు. ఈఘటన విషయంలో ఏడు మందిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### కోదండ రామాలయం అభివృద్ధికి సహకరించండి

**చక్రాయపేట :** గండిక్షేత్రంలోని కోదండ రామాలయం అభివృద్ధికి సహకరించాలని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు బీజేపీ నేతలు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోదండ రామాలయం కింద భాగంలో ఉన్న గదులతో పాటు వాటి ముందు ఖాళీ స్థలంలో ఎలాంటి దుకాణాలను నిర్వహించ కుండా చూడాలన్నారు. ఆస్థలం కోదండ రామాలయానికి చెందినది. అయితే ప్రతి సంవత్సరం గండి ఆలయం తరపున ఇక్కడ దుకాణాలకు అద్దెకు ఇస్తున్నారన్నారు. ఇక్కడ అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ రామచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరి ప్రసాద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్డీఓ కార్యాలయ ఏఓగా తిరుపతయ్య

**జమ్మలమడుగు రూరల్ :** స్థానిక ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారిగా తిరుపతయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ముందు నంద్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు. గతంలో జమ్మలమడుగు, మైలవరం తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం కార్యాలయంలోని అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు.

### అర్జీలను వెంటనే పరిష్కారించాలి

**జమ్మలమడుగు రూరల్ :** ప్రతి సోమవారం స్పందనలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ పి.శ్రీనివాసులురెడ్డి సిబ్బందికి సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యాలయంకు పనుల మీద వచ్చే ప్రజలను కార్యాలయం చుట్టు తిప్పుకోకుండా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏమైన సమస్యలు ఉంటే నేరుగా తనతో చెప్పాలని అధికారులకు సూచించారు.

### ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**లింగాల :** లింగాలలో 2024–25 సంవత్సరానికి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ మూడవ విడత ప్రవేశానికి ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు 10వ తరగతి మార్కులిస్టు, ఆధార్‌కార్డు, కులధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడీలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈనెల 26వ తేదీ సాయంత్రంలోపు iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు లింగాల ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు.

### వస్త్రదుకాణం ప్రారంభం

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని స్థానిక పాత మార్కెట్ వైఎస్ జయమ్మ కాంప్లెక్స్‌లో వైఎస్సార్సీపీ నాయకులు కొంగనపల్లె రవికుమార్ ఆధ్వర్యంలో సాయిజోషిక క్లాత్ స్టోర్‌ను సోమవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్, బలిజ సంఘం అధ్యక్షులు గూడూరు గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### గండి అవినీతిపై విచారణ జరిపించాలి

**వేంపల్లె :** గండిక్షేత్రంలో జరుగుతున్న అవినీతి కార్యక్రమాలపై విచారణ జరిపించాలని వేంపల్లె మండల టీడీపీ కన్వీనర్ రామమునిరెడ్డి, గండిక్షేత్రం మాజీ చైర్మన్ వడ్లకుంట రాజారావులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు గండిక్షేత్రం అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్యపై మండిపడ్డారు. శ్రావణమాస ఉత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రికల్లో ప్రొటోకాల్ పాటించకుండా ఆహ్వాన పత్రికను ముద్రణ చేశారన్నారు. అందుకు బాధ్యులైన వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ఈఓగా పనిచేసిన ముకుందారెడ్డి శాశ్విత నిత్యాన్నదానం కోసం రూ.4 కోట్ల వరకు దాతల నుంచి వసూలు చేశారన్నారు. ఆ డబ్బులను బ్యాంకులో జమచేయడం జరిగిందన్నారు. ఆ డబ్బులు దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యవేక్షణ కొరవడి
# గాడి తప్పుతున్న బడి

సర్కారు బడి మళ్లీ తడబడుతోంది.. గత ప్రభుత్వం సర్కారు బడులకు జీవం పోసింది. కార్పొరేట్ స్థాయి హంగులు తీసుకొచ్చింది. రంగులు అద్ది.. మెరుగులు దిద్దింది. ఐదేళ్లు కొత్త ఒరవడితో చదువుల విప్లవం సాగింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోపే చతికిలబడుతోంది. విద్యా వ్యవస్థపై సరిగా దృష్టి సారించకపోవడంతో.. ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. అంతా సర్దుబాట్లతోనే నెట్టుకురావాల్సి వస్తోంది. పాఠశాలలు తెరిచి 50 రోజులు దాటినా.. విద్యార్థుల చేతికి ఇంకా కొన్ని పాఠ్యపుస్తకాలు అందలేదు. విద్యా కానుక కిట్ల పంపిణీ పూర్తి కాలేదు. మధ్యాహ్న భోజనం రుచి తగ్గుతూ వస్తోంది. అమ్మ ఒడి వంటి ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో.. పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు.



పులివెందులలో ఒకే తరగతి గదిలో రెండు తరగతుల విద్యార్థులు కూర్చున్న దృశ్యం

- సర్కారు బడుల్లో మళ్లీ సమస్యల పాఠాలు
- ఇంకా అందని కొన్ని పాఠ్యపుస్తకాలు
- పూర్తి కాని విద్యాకానుక పంపిణీ
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అవస్థలు పడుతున్న విద్యార్థులు

**కమలాపురం/పులివెందుల/జమ్మలమడుగు :** ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు అవస్థలు ఎదుర్కొవాల్సి వస్తోంది. ప్రభుత్వ, మేనేజ్‌మెంట్, మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. విద్యార్థుల ఆకలి తీర్చడం కోసం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనం నాణ్యత కొరవడిందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మోనూ పటించడం లేదంటున్నారు. విద్యార్థులకు బడి తెరిచే నాటికే పూర్తి స్థాయిలో స్కూల్ కిట్లు, యూనిఫాం గతంలో అందించేవారు. ప్రస్తుతం అరకొరగా స్కూల్‌కిట్లు, యూనిఫాం అందజేశారని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. అలాగే పలు స్కూళ్లకు ప్రహరీలేక పోవడంతో చోరీలు జరగడం, పాఠశాల ఆవరణలోకి మందుబాబులు, పశువులు ప్రవేశిస్తున్నాయి.

కమలాపురం మండలంలోని 35 పాఠశాలల్లో రెండో విడతగా కింద వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టింది. అయితే ఇందులో 8 అంగన్వాడీ కేంద్రాలు కూడా ఉన్నాయి. మొత్తం 35 పాఠశాలలకు గాను రూ.74.05కోట్లు నిధులు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో చాలా పాఠశాలల్లో పనులు పూర్తి అయ్యాయి. కమలాపురం జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో రూ.71.97లక్షలు, చిన్నరెడ్డిపల్లె హైస్కూల్‌లో 126.83లక్షలు, కోగటంలో రూ11.92 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం తాత్కాలికంగా ఆగిపోయింది. సర్కార్ బడుల్లో మధ్యాహ్న భోజనం అధ్వానంగా తయారైంది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ వా రికి సరిపడ భోజనం అందించడం లేదు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉన్న విద్యార్థులు కూడా తక్కువ సంఖ్యలో ఉన్నారు. పులివెందుల మండల వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 14 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. జమ్మలమడుగు నియోజవర్గంలో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్య వేదిస్తోంది. మధ్యాహ్న భోజనం సరిగా లేదని ఆరోపణలు వస్తున్నాయి.



వి.కొత్తపల్లె పాఠశాలలో పునాదులకే పరిమితమైన మరుగుదొడ్లు

| కమలాపురం నియోజకవర్గం.. | |
|---|---|
| మండలాల సంఖ్య | 6 |
| ప్రభుత్వ పాఠశాలల సంఖ్య | 343 |
| విద్యార్థుల సంఖ్య | 22,621 |
| ఉండాల్సిన ఉపాధ్యాయుల సంఖ్య | 1193 |
| ప్రస్తుతం వున్న ఉపాధ్యాయుల సంఖ్య | 1173 |

| పులివెందుల నియోజకవర్గం.. | |
|---|---|
| మండలాల సంఖ్య | 7 |
| ప్రభుత్వ పాఠశాలల సంఖ్య | 300 |
| విద్యార్థుల సంఖ్య | 21,444 |
| ఉపాధ్యాయుల సంఖ్య | 1032 |
| ఉపాధ్యాయుల కొరత | 58 |

| జమ్మలమడుగు నియోజకవర్గం.. | |
|---|---|
| మండలాల సంఖ్య | 6 |
| ప్రభుత్వ పాఠశాలల సంఖ్య | 245 |
| విద్యార్థుల సంఖ్య | 21,516 |
| ఉపాధ్యాయుల సంఖ్య | 930 |
| ఉపాధ్యాయుల కొరత | 50 |



లింగాల : అమ్మయ్యగారి పాఠశాలలో నిలిచిపోయిన కిచెన్ సెంటర్ పనులు

#### వసతులు మెరుగు పరచాలి



ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగు పరచాలి. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మంచి నీరు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ కిట్లు మూలకు చేరాయి. వాటిని రిపేరు చేసి వినియోగంలోకి తీసుకురావాలి. అలాగే మరుగుదొడ్లు లేని పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించాలి. విద్యార్థులు అసౌకర్యాలకు గురి కాకుండా అన్ని వసతులు మెరుగు పరచాలి.
– ఎం. ఒబయ్య, విద్యార్థి తండ్రి, టి.చదిపిరాళ్ల, కమలాపురం.

#### తరగతి గదులు సరిపోక అవస్థలు



విద్యార్థులకు సరిపడ గదులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 763 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అదనపు తరగతి గదుల కోసం రూ .1.20 కోట్లు నిధులు మంజూరయ్యాయి. గత ప్రభుత్వంలో నిర్మాణ పనులు చేపట్టి స్లాబ్ వరకు వేశారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్టర్లకు బిల్లును చెల్లించకపోవడంతో పనులను నిలిపివేసి వెళ్లిపోయారు.
– చెరుకూరి. శ్రీనివాసులు, తెలుగు ఉపాధ్యాయులు, వేంపల్లి.

#### అదనపు తరగతి గదులను పూర్తి చేయాలి



కమలాపురం జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలి. బాయ్స్ హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులతో పాటు ప్లస్ టూ విద్యార్థులు చదువుతున్నారు. దీంతో తరగతి గదుల అవసరం అయ్యాయి. ప్రభుత్వం అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. వాటి నిర్మాణం ప్రస్తుతం ఆగి ఉంది. నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి.
– ఎంసీ సుబ్బరాజు, జడ్పీ హైస్కూల్, కమలాపురం.

#### అప్పటి ప్రభుత్వంలో పనులు బాగా సాగాయి



నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలో శరవేగంగా అభివద్దికి నోచుకున్నాయి. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలో పనులు ఆగిపోవడంతో విద్యార్థులకు తరగతి గదులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాలకులు అధికారులు స్పందించి త్వరితగతిన పనులను పూర్తి చేస్తారని ఆశిస్తున్నాం.
– అన్నం లక్ష్మీనారాయణమ్మ, బుగ్గలేటిపల్లి, చింతకొమ్మదిన్నె.

#### తరగతి గదులను పూర్తిచేయండి



నాడు నేడు పనుల కింద తరగతి గదిలో పూర్తి స్థాయిలో నిర్మాణం అవుతే విద్యార్థులకు మంచి వసతి లభిస్తుంది. ప్రస్తుత ప్రభుత్వంలో నాడు నేడు పనులు జరగకపోవడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ఇప్పటికైనా ప్రస్తుతం దీనిపై చర్యలు చేపట్టి సగ నిర్మాణంలో ఆగిపోయిన పాఠశాలలను పూర్తి చేయాలని కోరుతున్నాం.
– చౌదం హరికృష్ణ, బుగ్గలేటిపల్లి, చింతకొమ్మదిన్నె.

#### విద్యాకానుకలు సక్రమంగా అందించాలి



ప్రభుత్వం అందిస్తున్న విద్యాకానుకలు విద్యార్థులకు అసక్రమంగా అందించాలి. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలి. కొన్ని పాఠశాలల్లో అన్నం సరిగాలేక పోవడంతో విద్యార్థులు వాటిని పడేస్తున్నారు. పాఠశాలలో భోజనం చేసేటప్పుడు ఉపాధ్యాయులు పరిశీలించాలి. విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలి.
– రామలక్ష్మి, పులివెందుల

## పనిభారంతో సచివాలయ ఉద్యోగులు సతమతం

**సింహాద్రిపురం :** సచివాలయ ఉద్యోగులు పెన్షన్ పంపిణీ చేయడం వల్ల వారికి పనిభారం ఎక్కువైంది. దీంతో పెన్షన్ పంపిణీలో డబ్బులు ఎక్కువ ఇచ్చి తమ చేతి నుంచి డబ్బులు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఓ సచివాలయ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈనెల 1వ తేదీన సచివాలయ సిబ్బంది ఉదయం 4 గంటలకు వచ్చి పెన్షన్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా సచివాలయ ఉద్యోగి పంపిణీ చేస్తూ ఉండగా అదే రోజు సంబంధిత అధికారుల నుంచి ఫోన్లు రావడంతో ఒక లబ్ధిదారుడికి రూ.500లు ఇవ్వాల్సి ఉండగా రూ.3 వేలు ఇవ్వడంతో ఆ ఉద్యోగి రూ.2500 చేతినుంచి చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇది కేవలం పనిభారం వల్లనే ఏర్పడిందని ఆ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు పింఛన్ పంపిణీ రోజున పనిభారం లేకుండా చూడాలని, లేదంటే తమ సొంత డబ్బులను చెల్లించాల్సిన పరిస్థితి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## తల్లిపాలు బిడ్డకు వరం

**వల్లూరు :** తల్లిపాలు బిడ్డకు దేవుడిచ్చిన వరం లాంటివని హెల్త్ సూపర్ వైజర్ మమత తెలిపారు. మండల పరిధిలోని దుగ్గాయపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన గంటలోపు తల్లి తప్పని సరిగా బిడ్డకు ముర్రుపాలు పట్టించాలన్నారు. తల్లి పాల ప్రాముఖ్యత గురించి ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రాసమ్మ, పార్వతి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దీపిక, వైద్య సిబ్బంది, ఆశా, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**కొండాపురంలో..**

**కొండాపురం :** పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టడంతో పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.భారతి తెలిపారు . సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని ఎస్.తిమ్మాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ ధనలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త విజయకుమారి, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు

**ముర్రుపాలలో పోషకాలు అధికం**

**ఎర్రగుంట్ల :** అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి నుంచి వచ్చే ముర్రుపాలను తాపిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందని చిలంకూరు పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి తెలిపారు. సోమవారం నిడుజివ్వి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.

## బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు



నజీర్‌అహ్మద్, పులివెందుల



రామచంద్రుడు, తొండూరు



ఈశ్వరయ్య, లింగాల



రామకుమారి, ముద్దనూరు



ఇందిరారాణి, వేముల



శివరామిరెడ్డి, కమలాపురం



శోభనబాబు, ఎర్రగుంట్ల

**పులివెందుల టౌన్ :** పులివెందుల తహసీల్దార్‌గా నజీర్‌అహ్మద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ప్రొద్దుటూరు తహసీల్దార్‌గా పని చేస్తూ ఎన్నికల నిర్వహణలో కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఎన్నికల అనంతరం పులివెందుల తహసీల్దార్‌గా నియమితులయ్యారు.

**తొండూరులో..**

**తొండూరు :** మండల నూతన తహసీల్దార్‌గా బి.రామచంద్రుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నంద్యాల జిల్లా మహానంది నుంచి బదిలీపై తొండూరుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్. జిలాని సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో డీటీ రామకృష్ణారెడ్డి, వీర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

**లింగాలలో..**

**లింగాల :** మండల నూతన తహసీల్దార్‌గా తుమ్మాది ఈశ్వరయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా నుంచి వైఎస్సార్ జిల్లాకు వచ్చారు. పులివెందుల రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో తొలి డివిజనల్ పరిపాలన అధికారి (డీఏఓ)గా విధులు నిర్వహించారు.

**ముద్దనూరులో..**

**ముద్దనూరు :** మండల తహసీల్దారుగా రామకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన రామకుమారి తహసీల్దారుగా విధుల్లో చేరారు.

**వేములలో..**

**వేముల :** వేముల తహసీల్దార్‌గా ఇందిరారాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాజుపాలెం మండలంలో పనిచేస్తున్న అనంతపురం జిల్లా కనేకల్ మండలానికి బదిలీపై వెళ్లారు. అక్కడ నుంచి వేముల తహసీల్దార్‌గా నియమితులయ్యారు.

**కమలాపురంలో..**

**కమలాపురం :** మండల తహసీల్దార్‌గా బి.శివరామిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం అర్బన్‌లో తహసీల్దార్‌గా ఉన్న ఆయన జిల్లాలో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కమలాపురం తహసీల్దార్‌గా నియమింపబడ్డారు. ఎన్నికల బదిలీల్లో కమలాపురం తహసీల్దార్‌గా వచ్చిన సుబ్రమణ్యం బీఎస్ కండ్రిగకు బదిలీపై వెళ్లారు.

**ఎర్రగుంట్లలో..**

**ఎర్రగుంట్ల :** మండల తహసీల్దార్‌గా శోభనబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలు ఎవైన ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ తేజస్వీని, భూసర్వే డిటీ రమణారెడ్డి, ఆర్ఐ తరుణ, వీఆర్ఓ, వీఆర్ఏలు ఆయనకు స్వాగతం పలికారు.

**మైలవరంలో..**

**మైలవరం :** మండల తహసీల్దార్‌గా లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.

## ఇ–క్రాప్ నమోదుతోనే పథకాల లబ్ధి

**కమలాపురం :** రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను ఇ–క్రాప్ బుకింగ్ చేస్తేనే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు లబ్ధి చేకూరుతాయని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం కమలాపురంలో ఖరీఫ్–2024 ఇ–క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయ డివిజన్ పరిధిలోని ప్రతి రైతు వీఏఏలను కలసి తాము సాగు చేసిన పంటలకు ఇ–క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. ఇ–క్రాప్ బుకింగ్ చేస్తేనే ప్రభుత్వం అందించే పంటల బీమా, సున్నా వడ్డీ, పంట నష్టపరిహారం, కనీస మద్దతు ధర, పంట కొనుగోళ్ల తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. ఇ–క్రాప్ చేసుకున్న ప్రతి రైతు ఈ కేవైసీ కూడా తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. అలాగే కొత్తగా సాగు చేసిన ఉద్యాన పంటలకు కూడా ఇ–క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు మినుము 1013 హెక్టార్స్, వేరుశనగ 148 హెక్టార్స్, కొర్ర 4, పత్తి 22, వరి 226 హెక్టార్స్‌లో సాగు చేశారని, ఈ రైతులంతా తప్పని సరిగా ఇ–క్రాప్ బుకింగ్, ఈ కేవైసీ నమోదు చేసుకోవాలన్నారు.

**ఇ–క్రాప్ బుకింగ్ పక్కాగా నమోదు చేయాలి**

వ్యవసాయ శాఖ సిబ్బంది ఇ–క్రాప్ బుకింగ్ పక్కాగా చేపట్టాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక తన కార్యాలయంలో డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలు, వీఏఏలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతు పొలానికి వెళ్లి ఇ–క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. పంట సాగు చేసిన సర్వే నెంబర్‌లోకి వెళితేనే ఇ–క్రాప్ బుకింగ్ చేసే కెమెరా ఆన్ అవుతుందని, లేక పోతే కెమెరా ఆన్ కాదని వివరించారు. ఇ–క్రాప్ బుకింగ్ పక్కాగా చేసేందుకు ప్రభుత్వం ఈ సాంకేతికతను వినియోగిస్తుందన్నారు. అలాగే వీఏఏలు మీ పరిధిలో క్షేత్ర స్థాయిలో పర్యటించి మినుము పంటలకు ఆశించిన తెగుళ్లు వాటి నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించాలన్నారు. అనంతరం ఇ–క్రాప్ యాప్, దాని పనితీరుపై టెక్నికల్ పర్సన్ జి.వెంకటేష్ శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఏఓలు సరస్వతి, శ్యాంబాబు, సంతోషిని, రవికుమార్‌రెడ్డి, ఏఈఓ దస్తగిరి, వీఏఏలు పాల్గొన్నారు.



కమలాపురం : ఇ–క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి



పులివెందుల : ఇ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రమేష్

**ఎట్టకేలకు ఇ–క్రాప్ నమోదు**

**ఎర్రగుంట్ల :** సాగు చేసిన పంటలపై ఇ క్రాప్ నమోదుకు ఎట్టకేలకు చంద్రబాబు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో మండల వ్యాప్తంగా వ్యవసాయ శాఖ సహయకులు ఇ క్రాప్ పనులు చేస్తున్నారు. మండల పరిధిలో 1400 హెక్టార్ల వరకు పంటలు వేశారు. సాగు చేసిన ప్రతి పంటకు ఇ–క్రాప్ బుకింగ్ చేయడంతో పాటు సదరు రైతుల బయోమెట్రిక్‌తో ఈకేవైసీ చేయాల్సివుంది. ఏటా జూలై రెండో పక్షం నుంచి ప్రత్యేక యాప్ ద్వారా మొదలు పెట్టి సెప్టంబర్ ఆఖరు వరకు కొనసాగిస్తారు. గత ఐదేళ్ల అధికారంలో ఉన్న జగన్ సర్కార్ దేశంలో మరెక్కడాలేని విధంగా వ్యవసాయంలో విప్లత్మకంగా మార్పులు తీసుకువచ్చారు.

**వీరపునాయునిపల్లె :** మండలంలోని రైతులు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. సోమవారం మండలంలోని అలిదెన గ్రామంలో చేపడుతున్న పంట నమోదు కార్యక్రనమాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. పంట నమోదు కార్యక్రమాన్ని మండలం, జిల్లా, డివిజనల్, రాష్ట్రస్థాయి అధికారులు తనిఖీ చేస్తారన్నారు. ఏవైనా వ్యత్యాసాలు కనిపిస్తే వెంటనే నమోదు చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**ప్రతీ రైతు ఇ క్రాప్ నమోదు చేసుకోవాలి**

**లింగాల :** 2024 ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు ఇ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు. సోమవారం మండలంలోని లింగాల గ్రామంలో జరుగుతున్న ఇ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు.